WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

తెలుగు దిన పత్రిక

NETI DARSHINI TV TELANGANA

రంగారెడ్డి, నల్గొండ | సంపుటి : 01 | సంచిక : 04 | మంగళవారం 19 - 11 - 2024 | ఎడిటర్ : కట్ల సత్యనారాయణ | పేజీలు : 4 | వెల : 3

## మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు



నేటి దర్శిని, ఇంఫాల్: మణిపూర్‌లో ఉద్రికత్తలు కొనసాగుతున్నాయి. హింసాత్మకమైన జిరిబామ్ జిల్లాలో భద్రతా బలగాలు, నిరసనకారుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఒక నిరసనకారుడు మరణించాడు. ఆదివారం రాత్రి పలువురు నేతల ఆస్తులు, పార్టీ కార్యాలయాలపై ఆందోళనకారులు దాడులు చేసినట్లు పోలీసులు తెలిపారు. 2

## ప్రాణం తీసిన ఆన్‌లైన్ లవ్

- ప్రేమ పేరుతో బాలికకు వల
- కలిసి 10 రోజుల సహజీవనం!
- పెండ్లికి ఒత్తిడి తేవడంతో దారుణహత్య
- వీడిన మియాపూర్ మిస్సింగ్ కేసు మిస్టరీ



నేటి దర్శిని, మియాపూర్ : మియాపూర్ 17ఏళ్ల బాలిక మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. తుక్కుగూడలోని ఓ ప్లాస్టిక్ పరిశ్రమ వద్ద బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. బాలికను ప్రేమ పేరుతో వలలో వేసుకున్న ఉప్పుగూడ యువకుడు, దొంగతనం కేసులో పాతనేరస్థుడు విఘ్నేశ్ అలియాస్ చింటూ హత్య చేసినట్టు నిర్ధారించారు. ఈ మేరకు హంతకుడు విఘ్నేశ్‌తో పాటు హత్యకు సహకరించిన మరో ఇద్దరిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ క్రాంతికుమార్ కేసు వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ మియాపూర్ టీపీ నగర్‌కు చెందిన బాలిక(17)కు ఉప్పుగూడకు చెందిన విఘ్నేశ్ అలియాస్ చింటూతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఐదు నెలల క్రితం ఇద్దరు ఫలక్‌నుమాలోని ఓ గుడివద్ద కలుసుకున్నారు. ఆ తర్వాత తరువాత ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేసుకుంటూ మరింత స్నేహంగా మారారు. ప్రేమిస్తున్నానంటూ విఘ్నేశ్ ప్రపోజ్ చేయగా ఆ బాలిక అంగీకరించింది. మియాపూర్ వెళ్లిన విఘ్నేశ్ దాదాపు 20 రోజుల క్రితం బాలికను ఉప్పుగూడకు తీసుకెళ్లాడు. విఘ్నేశ్ స్నేహితుడు సాకేత్, కల్యాణి దంపతులకు పరిచయం చేశాడు. దీంతో సాకేత్ ఇల్లు ఖాళీ చేసి కంచన్‌బాగ్‌లోని మరో ఇంటికి షిఫ్ట్ అయ్యాడు. వీరితో పాటే విఘ్నేశ్, బాలిక నివసించారు. ఆ బాలిక తల్లిదండ్రులతో టచ్‌లోనే ఉంది. ఆమె తల్లిదండ్రులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. సదరు బాలిక దాదాపు 10 రోజుల పాటు విఘ్నేశ్‌తో సహజీవనం చేసింది. ఈ క్రమంలో బాలిక ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతున్నదని విఘ్నేశ్ 2



## నెలన్నరలో 2,234 ఓవరేజ్ వాహనాలు సీజ్



నేటి దర్శిని, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబర్ ఒకటి నుంచి నవంబర్ 15 మధ్య రవాణాశాఖ 2,234 ఓవరేజ్ వాహనాలను సీజ్ చేసింది. నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నది. గత కొద్ది రోజులుగా ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో గ్రేడెడ్ రెస్పాన్ యాక్షన్ ప్లాన్ మూడు, నాల్గో దశలను ప్రభుత్వం అమలు చేస్తున్నది. చేసిన 2

## సీఎం రేవంత్ రెడ్డి ఓ చేతకాని దద్దమ్మ



నేటి దర్శిని, రంగారెడ్డి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ చేతకాని దద్దమ్మ అని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ నిప్పులు చెరిగారు. కొడంగల్ నియోజకవర్గ ంలోని లగచర్లకు వెళ్తున్న ఎంపీ డీకే అరుణను పోలీసులు 2

## బీజేపీ అంటే ఏంటో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చూపిస్తాం



నేటి దర్శిని, హైదరాబాద్ : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వల్ల రాజకీయాలు దిగాజారిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... రాజకీయాలంటే 2

## మణిపూర్‌కు మరో.. 50 సీఆర్‌పీఎఫ్ కంపెనీలు



నేటి దర్శిని, న్యూఢిల్లీ : మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ ప్రజ్వరిల్లడంతో అక్కడి పరిస్థితిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రెండో రోజైన సోమవారంనాడు కూడా అత్యున్నత స్థాయి భద్రతా సమావేశంలో సమీక్షిమించారు. ఈశాన్య రాష్ట్రంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుతుండంతో రాష్ట్రంలో భద్రతను మరింత పటిష్టం చేయాలని హోం 2

## కొణతం దిలీప్ అరెస్టుపై మండిపడ్డ కేటీఆర్

ప్రశ్నిస్తే సంకెళ్లు..! నిలదీస్తే అరెస్టులు..!



నేటి దర్శిని, హైదరాబాద్ : తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను పోలీసులు మళ్లీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దిలీప్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ 2

## గ్రూప్-3 పరీక్షలకు 50 శాతం మందే హాజరు



నేటి దర్శిని, హైదరాబాద్ : టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు పేపర్లకు కలిపి మొత్తంగా 50 శాతం మందే హాజరయ్యారు. నిన్న నిర్వహించిన పేపర్1 పరీక్షకు 51.1 శాతం, పేపర్ 2 పరీక్షకు 50.7శాతం హాజరు కాగా, సోమవారం నిర్వహించిన పేపర్ 3కి 50.24 శాతం మంది హాజరైనట్లు టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు.

## మీరా.. నీతులు చెప్పేది!



నేటి దర్శిని, అమరావతి : దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసి వచ్చిన వారూ శాసన మండలిలో నీతులు చెప్పడం దారుణమని రాష్ట్ర హోం మంత్రి అనిత వైసీపీ సభ్యులపై నిప్పులు 2

## మహిళా భద్రతపై టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలపై ధ్వజమెత్తిన షర్మిల

మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు అరికట్టడంలో పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విఫలం 2

## మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా జరిగిన అల్లర్లలో 21 ఏళ్ల అథౌబా చనిపోయినట్లు చెప్పారు. అయితే అతడిపై ఎవరు కాల్పులు జరిపారో అన్నది పోలీసులు స్పష్టం చేయలేదు. కాగా, నిరసనకారుల గుంపును చెదరగొట్టేందుకు పోలీస్ ప్రత్యేక కమాండోలు ఆయుధాలు ప్రయోగించినట్లు జనం ఆరోపించారు. ఈ కాల్పుల్లో అథౌబా మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారని నిరసనకారులు తెలిపారు. మరోవైపు మహిళలు, పిల్లలను కుకీ మిలిటెంట్లు హత్య చేయడంపై మణిపూర్‌లో నిరసనలు, హింసాత్మక సంఘటనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్కూళ్లు, కాలేజీలకు రెండు రోజులు సెలవు ప్రకటించారు. ఇంఫాల్ పశ్చిమ, తూర్పు జిల్లాల్లోని యూనివర్సిటీలు, కాలేజీలతో సహా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను మంగళవారం వరకు మూసివేస్తున్నట్లు ప్రభుత్వం సోమవారం ప్రకటించింది.

## సీఎం రేవంత్ రెడ్డి ఓ చేతకాని దద్దమ్మ

మొదటిపేజీ తరువాయి



మొయినాబాద్ వద్ద అడ్డుకున్నారు. ఆమెను అరెస్టు చేసి నార్సింగి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ.. పాలనచేతకాక, నన్ను అడ్డకుంటావా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత నియోజకవర్గం కొడంగల్‌లో శాంతి భద్రతలు కంట్రోల్ చేయలేని అసమర్థుడు రేవంత్ రెడ్డి అని ఆమె మండిపడ్డారు. ఇక ఎంపీ అరుణతో పాటు మరో ఎంపీ ఈటల రాజేందర్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిని కూడా పోలీసులు అరెస్టు చేశారు.

## కొణతం దిలీప్ అరెస్టుపై మండిపడ్డ కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే సంకెళ్లు వేయడం.. నిలదీస్తే అరెస్టు చేయడం సరికాదన్నారు కేటీఆర్. నియంత రాజ్యమది.. నిజాం రాజ్యాంగమిది.. అని రేవంత్ రెడ్డి సర్కార్‌ను దుయ్యబట్టారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే కొణతం దిలీప్ అరెస్ట్.. విచారణకు రమ్మని పిలిచి అక్రమంగా అరెస్ట్ చేస్తారా? అని ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నాళ్లు ఈ అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తావ్! ప్రజాస్వామ్య ప్రేమికులం.. ప్రజాస్వామ్యబద్ధంగానే ఎదుర్కొంటాం! అని తేల్చిచెప్పారు కేటీఆర్. నీ అక్రమ అరెస్టులకో.. నీ ఉడత బెదిరింపులకో.. భయపడం..! నీ అక్రమ అరెస్టులకు భయపడేవాడు ఎవరూ లేరిక్కడ అని కేటీఆర్ స్పష్టం చేశారు. చివరగా జై తెలంగాణ అని పేర్కొంటూ కేటీఆర్ తన ట్వీట్‌ను ముగించారు.

## నెలన్నరలో 2,234 ఓవరేజ్ వాహనాలు సీజ్



మొదటిపేజీ తరువాయి

చేస్తున్నది. చేసిన ఓవరేజ్ వాహనాల్లో పదేళ్లకుపైగా 260 డీజిల్ ఫోర్ వీలర్లు ఉన్నాయని ఢిల్లీ రవాణా శాఖ పేర్కొంది. 15 ఏళ్లు పైబడిన 1,156 పెట్రోల్ ద్విచక్ర వాహనాలు, 818 పెట్రోల్ త్రీవీలర్స్, ఫోర్ వీలర్స్ సీజ్ చేసినట్లు చెప్పింది. ఈ డ్రైవ్ డిసెంబర్ వరకు కొనసాగుతుందని.. పర్యావరణ నిబంధనలను అమలు చేయడానికి, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలను తగ్గించే ప్రయత్నంలో భాగమని ఢిల్లీ రవాణా శాఖ పేర్కొంది. ఓవరేజ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీ రవాణాశాఖ పోర్టల్‌ని ప్రారంభించింది. స్వాధీనం చేసుకున్న వాహనాలను స్క్రాప్ చేయడం, వెనక్కి తీసుకోవడం, విక్రయించడం సులభతరం చేయడం.. స్క్రాపింగ్ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, వాహన యజమానులకు అలాంటి వాహనాల నిర్వహణ కోసం స్పష్టమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ విధానాన్ని అందించేందుకు ప్లాట్‌ఫారమ్ ప్రారంభించారు. ఇటీవలి ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రకారం.. వాహనాలను నిర్వహించేందుకు 2024 మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఢిల్లీ రవాణా శాఖ రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీస్‌కి ఆదేశాలు జారీ చేసింది. ఆర్డర్‌ను పాటించకపోతే ప్రోగ్రామ్ నుంచి మినహాయించబడవచ్చని పేర్కొంది. ఢిల్లీలో పది సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాలపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాజధానిలో ఓవరేజ్ వాహనాలపై డ్రైవర్ నిర్వహిస్తూ వస్తున్నారు. 15 సంవత్సరాల కంటే పాత వాహనాలను బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ చేయడాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సైతం నిషేధించింది. ఇప్పటి వరకు ఢిల్లీ రవాణాశాఖ 55 లక్షలకుపైగా ఓవరేజ్ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేసింది.

## మహిళా భద్రతపై టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలపై ధ్వజమెత్తిన షర్మిల



నేటి దర్శిని, విజయవాడ: మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు అరికట్టడంలో పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విఫలం అవుతోందని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. గడిచిన పదేళ్లల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల కేసులు నమోదు అయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని ఆమె మండిపడ్డారు. శాసన మండలిలో ఇవాళ జరిగిన చర్చే ఇందుకు నిదర్శనమని షర్మిల అన్నారు. పదేళ్లుగా మహిళలకు రక్షణ కల్పించడంలో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో 2014 -19 మధ్య మహిళలపై దాడులు జరిగిన ఘటనల్లో 83,202 కేసులు, 2019 -24 మధ్య 1,00,508 కేసులు నమోదు అయ్యాయని శాసన మండలి సాక్షిగా ప్రజాప్రతినిధులే చెబుతున్నారని ఆమె అన్నారు. తమ పాలనలో కంటే వైసీపీ హయాంలోనే 20 శాతం ఎక్కువ కేసులు నమోదయ్యాయని టీడీపీ నేతలు చెబుతుంటే.. లేదు లేదు కూటమి అధికారం చేపట్టిన తర్వాతే రోజుకు సగటున 59 అత్యాచారాలు జరుగుతున్నాయని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారని షర్మిల చెప్పుకొచ్చారు. కూటమి, వైసీపీ నేతలు మహిళల మానప్రాణాల మీద రాజకీయాలు చేస్తున్నారని షర్మిల ధ్వజమెత్తారు. గడిచిన పదేళ్లల్లో 2 లక్షల కేసులు నమోదు అయ్యాయంటే మహిళలకు రక్షణ ఉందా? అంటూ ఆమె ప్రశ్నించారు. ఆడవాళ్లకు భద్రత కల్పించడంలో ఏపీ రాష్ట్రం ఎక్కడుందో అర్థమవుతోందని మండిపడ్డారు. మహిళలపై నేరాలు అరికట్టలేని వైసీపీ, టీడీపీలు దొందూ.. దొందేనని షర్మిల అన్నారు. ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయమని చెప్పారు. నిర్భయ, దిశ లాంటి చట్టాలు పేరుకే తప్ప అమలుకు నోచుకోలేదని ఆమె ఆరోపించారు. చట్టాలను అమలు చేసిన దాఖలాలు ఎక్కడా కనిపించలేదంటూ ధ్వజమెత్తారు.

మహిళల భద్రతకు పెద్దపీట అని ఆర్భాటపు ప్రచారాలు తప్ప..10 ఏళ్లలో ఏ ఒక్క నేరస్థుడికీ కఠిన శిక్ష పడలేదని షర్మిల విమర్శించారు. కేసులు ఛేదించాల్సిన పోలీసులను కక్ష్యసాధింపు రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆమె ఆరోపించారు. పోలీసులను ఈ రెండు పార్టీలు ఏనాడూ వారి విధులు నిర్వర్తింపజేయనివ్వలేదని మండిపడ్డారు. ఏపీని అభివృద్ధిలో చివరిస్థానంలో, మాదక ద్రవ్యాల వాడకం, మహిళలపై అఘాయిత్యాలలో ప్రథమ స్థానంలో నిలిపారని ఏపీసీసీ చీఫ్ షర్మిల ఆగ్రహించారు.

## బీజేపీ అంటే ఏంటో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చూపిస్తాం

మొదటిపేజీ తరువాయి



అసహ్యం కలిగేలా ఈ రెండు పార్టీల తీరు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే తెలంగాణ సమాజం దిగజారుడు రాజకీయాలను సహించదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ పాలన ఎలా ఉందో.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలన అలానే ఉందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకటేనంటూ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లకు సహకారం అందించిన వాళ్లు ఎవరంటూ ఆయన వ్యంగ్యంగా ప్రశ్నించారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారి మాటలకు తాను స్పందించనన్నారు. లగచర్ల ఘటనపై తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తాను భారతీయులకు మాత్రమే గులామ్‌ను అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ 1 నుంచి 5 వ తేదీ వరకు బీజేపీ అంటే ఏంటో ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చూపిస్తామన్నారు. తెలంగాణలో మీ పని తీరుపై ప్రజలతోనే మాట్లాడుతామని చెప్పారు. మరోవైపు గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు గుప్పించింది. ఆ క్రమంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఆ పార్టీ ప్రకటించింది. కానీ వాటిని అమలు చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా విఫలమైందని బీజేపీ ఆరోపిస్తుంది. అందుకు నిరసనగా డిసెంబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ నిరసన తెలపాలని నిర్ణయించింది. అందులోభాగంగా పాదయాత్రల ద్వారా నిరసన తెలపాలని పార్టీ అగ్ర నాయకత్వం స్పష్టం చేసింది. దీంతో డిసెంబర్ 1 నుంచి అన్ని నియోజకవర్గాల్లో నిరసన పాదయాత్రలు చేపట్టనున్నారు. అలాగే మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి వేళల్లో బస చేయాలని బీజేపీ నిర్ణయించిన విషయం తెలిసిందే.

## మణిపూర్‌కు మరో 50 సీఆర్‌పీఎఫ్ కంపెనీలు

మొదటిపేజీ తరువాయి

శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న భద్రతా పరిస్థితిని అమిత్‌షా సమీక్షించడంతో పాటు, ఎలాంటి పరిస్థితుల్లోనూ శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు. మణిపూర్‌కు అదనంగా 50 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలను పంపించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుతం 20 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు రాష్ట్రంలో మోహరించగా, తాజా నిర్ణయంతో 70 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతను తీసుకుంటాయి.

**- ఆరుగురి ఊచకోతతో..**

గత ఏడాది మణిపూర్‌లో చెలరేగిన జాతుల ఘర్షణలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పొగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉన్న తరుణంలో గత శనివారంనాడు తిరిగి హింసాకాండ చెలరేగింది. సాయుధ మిలిటెంట్లు ఆరుగురు గ్రామస్థులను కిడ్నాప్ చేసి ఊచకోత కోసి చంపడంతో ఒక్కసారిగా ఆందోళనలు పెల్లుబికాయి. నిరసనకారులు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు చేసి, వాహనాలను తగులబెట్టారు. సీఎం బీరేంద్ర సింగ్ ఇంటిపై కూడా దాడికి విఫలయత్నం చేశారు. నిరసనలు, ఆందోళనలను అదుపు చేసే క్రమంలో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో జిరిబాం జిల్లాకు చెందిన 20 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆందోళనకారులు స్థానిక బీజేపీ, కాంగ్రెస్ కార్యాలయాల్లోకి చొరబడి ఆస్తుల విధ్వంసానికి పాల్పడ్డారు. ఫర్నిచర్‌ను దగ్ధం చేశారు. మణిపూర్‌లో సంక్షోభం ముదురుతుండటంతో శాంతిభద్రత వైఫల్యానికి నిరసగా బీజేపీ సారథ్యంలోని బీరేంద్ర సింగ్ ప్రభుత్వానికి నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) మద్దతును ఉపసంహరించుకుంది.

## ప్రాణం తీసిన ఆన్‌లైన్ లవ్

మొదటిపేజీ తరువాయి

మందలించాడు. ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. పెళ్లి చేసుకోవాలంటూ విఘ్నేశ్‌ను బాలిక నిలదీసింది. బాలికను హత్య చేయాలని విఘ్నేశ్ నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని సాకేత్, కల్యాణి దంపతులకు చెప్పాడు. పెళ్లి చేసుకుని హత్య చేస్తే ఎవరికీ అనుమానం రాదని వారు సలహా ఇచ్చారు. ఈ నెల 8న విఘ్నేశ్, బాలిక పెళ్లి చేసుకున్నారు. తాను విఘ్నేశ్‌ను పెళ్లి చేసుకున్నానని, వారంలో ఇంటికి వస్తానని ఆ బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. సాకేత్ దంపతులు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తర్వాత విఘ్నేశ్ బాలిక తలను గోడకేసి కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చిన సాకేత్, కల్యాణి సహకారంతో బాలిక మృతదేహాన్ని తుక్కుగూడలోని నిర్మానుష్య ప్రదేశంలో పడేశాడు. మరుసటి రోజు 9న బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసిన విఘ్నేశ్.. మీ బిడ్డ ఇంటికి వచ్చిందా అని అడిగాడు. అనుమానం వచ్చిన బాలిక తల్లిదండ్రులు మియాపూర్ పోలీసులకు 10న ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విఘ్నేశ్‌ను విచారించగా నేరం అంగీకరించారు. ఓఆర్ఆర్ సమీపంలో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. విఘ్నేశ్‌తో పాటు సాకేత్, కల్యాణిని పోలీసులు అరెస్ట్ చేశారు.

## మీరా.. నీతులు చెప్పేది!

మొదటిపేజీ తరువాయి

చెరిగారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై సోమవారం మండలి ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అడిగిన ప్రశ్న.. అనంతరం విపక్ష సభ్యులు చేసిన వ్యాఖ్యలపై మంత్రి అనిత విరుచుకుపడ్డారు. వైసీపీ హయాంలో జరిగిన దారుణాలను గణాంకాల సహితంగా వివరించారు. "దిశ చట్టాన్ని కొనసాగిస్తారా? లేదా?" అంటూ వైసీపీ సభ్యులడిన ప్రశ్నలపై మంత్రి అనిత స్పందిస్తూ.. దిశ చట్టం అసలు లేదని, నిర్భయ చట్టం మాత్రమే ఉందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్భయ చట్టం కింద కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలమయ్యాయంటూ వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపైనా మంత్రి మండిపడ్డారు. 2019-24 మధ్య జగన్ పాలనలో మహిళలపై అనేక అఘాయిత్యాలు జరిగినా కనీసం ఆయన చర్యలు తీసుకోలేదని హోం మంత్రి నిప్పులు చెరిగారు. దిశ చట్టానికి చట్టబద్ధత లేకుండానే 'దిశ' పేరిట పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారని అన్నారు. గతంలో టీడీపీ హయాంలో తెచ్చిన ఫోర్త్ లయన్ అనే యాప్‌నే దిశ యాప్‌గా మార్చారన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ల బోర్డులను మార్చి దిశ పోలీసస్టేషన్లుగా మార్చారన్నారు. నిర్భయ చట్టం ఉన్నా కూడా గత ప్రభుత్వం అమలు చేయకుండా, లేని దిశ చట్టాన్ని తెచ్చిందని దుయ్యబట్టారు.

Neti dharshini2:Neti dharshini.qxd 11/19/2024 8:01 AM Page 1



WWW.NETIDARSHINI.COM
నేటి దర్శిని
తెలుగు దిన పత్రిక

# ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం' హామీని అమలుచేయాలి

**హయత్ నగర్,నవంబర్19 (నేటి దర్శిని):** ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను వెంటనే విలీనం చేయాలని, 2021 వేతన సవరణ 30. శాతం వెంటనే అమలు చేసి, వేతన సవరణ బకాయిలు, అలవెన్సు పెంచి చెల్లించాలని జేఏసీ చైర్మెన్ ఈమీరు వెంకన్న కోరారు. బీజీఎస్ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర నాయకత్వం డిపోల పర్యటనలో భాగంగా సోమవారం హాయత్. నగర్ 1,2 డిపోలని సందర్శించారు. ఈ సమావేశానికి అమనగంటి వెంకన్న అధ్యక్షతన జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ వెల్ఫేర్ కమిటీలను రద్దుచేసి ట్రేడ్ యూనియ స్త్రీలను పునరుద్ధరించాలని ప్రభుత్వంకు ఆయన విజ్ఞప్తి చేశారు. సంపూర్ణ ఉద్యోగ భద్రత ప్రకటించాలని, చనిపోయిన మెడికల్ అండ్ ఫిట్ అయిన ఉద్యోగుల రెగ్యులర్ ప్రతిపాదికన ఉద్యోగాలు ఇవ్వాలని వివిధ కేసుల్లోఅన్యాయంగా సస్పెండ్ అయిన ఉద్యోగులను తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆఫీస్ కి ఇవ్వాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు బకాయిలు వెంటనే చెల్లించి 2017 పీఆర్సీ 21 శాతం అమలు చేయాలనీ, డిపోలలో పనిభారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. జేఏసీ కో కన్వీనర్ కత్తుల యాదయ్య మాట్లాడుతూ మేనేజ్మెంట్ అధిక పనిభారాలు కార్మికులపై మోపి ఉద్యోగులకు లీవులు ఇవ్వకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 5న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో కో కన్వీనర్ సుద్దాల సురేష్, సత్యపాల్, రామ్ రెడ్డి, ఎస్.మల్లేష్, పి.అచ్చాలు, కేక మూర్తి, పి.ఎస్ రావు, ఐబీపీ రెడ్డి, బాల నరసింహ, సతీష్ వెంకట్, బి.ఎస్.ఎస్ రెడ్డి, శ్రీధర్, స్వామి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



# డివిజన్లో సమస్యలు లేకుండా చూడాలి



**చంపాపేట్,నవంబర్18(నేటి దర్శిని):** రోజురోజుకు పెరుగుతున్న జనాభా అనుగుణంగా నియోజకవర్గంలో సమస్యలు లేకుండా పరిష్కరించాలని ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట డివిజన్ పరిధిలోని బైరామల్ గూడ పాత గ్రామంలో నూతన డ్రైయినేజ్ నిర్మాణ పనుల్లో భాగంగా ఎమ్మెల్యే స్థానిక నాయకులుతో కలసీ బస్తీలో సుడిగాలి పర్యటన చేపట్టారు. స్థానికులు సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న జనాభా నేపథ్యంలో ఇక్కడ ప్రస్తుతం మళ్ళీ 8 ఇంచెల డ్రైనేజ్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, గతంలో కూడా ఈ ప్రదేశంలో 8 ఇంచుల బ్రైయిరెజీ నిర్మాణం చేపట్టడం జరిగిందని, కావున ఆ డ్రైడు జీ స్థానంలో 12 ఇంచులా బ్రైయినేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరాడు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అక్కడ నుంచి అధికారులకు ఫోన్ చేసి డ్రైయినెజ్ సైజ్ పెంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు కూడా అధికారులకు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గజ్జల మధుసూదన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రాజిరెడ్డి మహిళా అధ్యక్షురాలు రోజురెడ్డి, చీర శ్రీనివాస్, ఉమ మహేశ్వర్, రాజు, కల్పన, ఆనసూయ, సతిరెడ్డి, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

**దిల్సుఖ్ నగర్,నవంబర్18(నేటి దర్శిని):** సిరి ధాన్యాలు భుజించి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ ఖాదర్ వలీ సూచించారు. సిరి. దాన్యాలు భుజించండి- సంపూర్ణ ఆరోగ్యంతో జీవించండి. అనే అంశంపై చిత్రా లేవుట్ కాలనీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పలు సూచనలు సలహాలు చేశారు. ఆహార సమతుల్యత లేకపోవడం వల్ల అనారోగ్యానికి గురౌతున్నామని ఆయన వివరించారు. చిరు ధాన్యాలు మనిషి నిత్యం ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. పూర్వ కాలంలో శారీరక శ్రమ ఉండడం ప్రకృతి పరంగా దొరికిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు ఉండేదని వివరించారు. చిన్న పిల్లలు యువత ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్, ప్రాసెసింగ్ చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఆనారోగ్యానికి భారినపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిరు ధాన్యాల్లో ఎటువంటి రసాయనాలు లేని వాటిని ఆహారంగా తీసుకోవడం ఉత్తమం అన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో సైతం చిరు ధాన్యాలకు క్రమంగా ఆదరణ పెరుగుతోందని ఇది నుంచి శుభపరిణామం అన్నారు. కార్పొరేట్ వైద్యులు సైతం చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సూచిస్తున్నారని డాక్టర్ ఖాదర్ వలీ తెలిపారు. గ్రామీణ ప్రాంతవాసులకే పరిమితం అయిన చిరుధాన్యాలు ప్రస్తుతం పట్టణ, నగరాల్లో సైతం విస్తృతంగా వినియోగిస్తున్నారని ఆయన అభిప్రాయ పడ్డారు. సరస్తును చిత్రా లేవుట్ కాలనీ సంక్షేమం సంఘం, తెలంగాణ విశ్రాంతి ఇంజినీర్ల సంఘం సంయుక్తంగా నిర్వహించారు. సదస్సులో శ్యాం ప్రసాద్ రెడ్డి, సము ద్రాల ధనుంజయ, గోవింద్ రెడ్డి, చిత్రా లేవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్య క్షులు పెండ్యాల నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు రేగట్టి సుధాకర్ రెడ్డి, ప్రధా న కార్యదర్శి గోదా కృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, శరత్, కిషోర్ రెడ్డి, లింగా రెడ్డి, అంజన్ రావు, సునయన తదితరులు కాలనీ వాసులు హాజరయ్యారు.



# రైతు సంక్షేమ అభివృద్ధికి కృషి

## సహకార సంఘం చైర్మెన్ భరత్ కుమార్



**అబ్దుల్లాపూర్ మెట్,నవంబర్18(నేటి దర్శిని):** రైతు సేవా సహకార సంఘం మరింత అభివృద్ధి చేయుటకు కృషి చేయనున్నట్లు సంఘం అధ్యక్షులు చేగూరి భరత్ కుమార్ అన్నారు. బాటసింగారం రైతు సేవా సహకార సంఘం పరిధిలోని బాటసింగారం గ్రామానికి చెందిన ఏసూరి గాలయ్య 2024 సెప్టెంబర్ 11 మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు సహకార సంఘం చైర్మెన్ చేగూరి భరత్ కుమార్ చేతుల మీదగా మృతి చెందిన రైతు ఎనూరి గాలయ్య భార్య పొన్నమ్మకు 25 వేల రూపాయల ఆర్థిక సాయం సోమవారం అందజేసి చేయూతనందిచారు. ఈ సందర్భంగా సంఘం చైర్మెన్ భరత్ కుమార్ మాట్లాడుతూ.. రైతు సేవా సంక్షేమ సంఘం రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతుల సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. ఆకాల మరణం చెందిన రైతుల కుటుంబాలకు బాసటగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఐలేష్, వివిధ గ్రామాలకు చెందిన రైతులు, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లగచర్ల ఘటనపై నిజ నిర్ధారణ కమిటీ సమావేశం

**ఓయూ,నవంబర్18(నేటి దర్శిని):**లగచర్ల భూ బాధితుల నిజ నిర్ధారణ కమిటీ సోమవా రం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సమావేశమైంది. లగచర్ల ఫార్మా భూముల సేకరణలో గిరిజన రైతులపై పెట్టిన కేసులు, కలెక్టర్పైన జరిగిన దాడి, అదేవిధంగా లంబాడి మహిళల మీద కొందరు పోలీసు అధికారులు అసభ్యంగా ప్రవర్తించినట్టు వచ్చిన ఆరోపణలపై పై నిజ నిజనిర్ధారణ కమిటీ ఈ నెల 20న ఆ గ్రామంలో పర్యటించి వివరాలను సేకరించడానికి ప్రతినిధుల బందంతో వెళ్లనున్నట్టు సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ముఖ్య సంజీవ నాయక్ తెలిపారు. కమిటీలో పౌర హక్కుల సంఘంతో పాటు అన్ని గిరిజన సంఘాలు జేఏసీగా ఏర్పాటు అయిన విషయం తెలిసిందే. ఉదయం 8 గంటలకు మహావిర్ హాస్పిటల్ లకిడికాపూల్ అక్కడి నుంచి సమావేశమై బయలుదేరి అక్కడికి చేరుకుంటామని, ప్రభుత్వం ప్రతినిధుల బందాన్ని ఎలాంటి అడ్డంకం చెప్పకుండా ధర్మంగా సందర్శనకు సహకరించాల్సిందిగా ఈ సమావేశంలో కోరారు. బంజారా బిడ్డలైన కాంగ్రెస్పార్టీ మహబూబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు రామచంద్రనాయక్, బాలు నాయక్లు గాంధీభవన్ లో మీడియా సమావేశంలో పేర్కొన్న అంశాలు పూర్తిగా ప్రభుత్వాన్ని సమర్థించే విధంగా, ప్రభుత్వాన్ని ఆదుకునే పద్ధతుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతి ఆడబిడ్డల మీద జరిగిన అసభ్య కార్యక్రమం ఏదైతే అరెస్టు పేరు మీద అలజడి చేసినరో దానిమీద మాట్లాడకపోవడం చాలా బాధగలుగుతున్నదని, అక్కడ గిరిజనులకు. 200 ఎకరాలు ఉంది 300 ఎకరాలే ఉంది అని మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. గిరిజన భూములను లాక్కోడానికి అసభ్యంగా మహిళల పట్ల ప్రవర్తించడానికి తీవ్రంగా ఖండించాల్సింది పోయి ప్రభుత్వాన్ని సమర్థించే భజన కమిటీలో ఉండడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ చంద్రు నాయక్, విద్యార్థి సంఘ నాయకులు శ్రీను నాయక్, నిరుద్యోగ జేసి నాయకులు మూతిలాల్ నాయక్, ఓయూ డా. కొర్ర, ఈశ్వర్ లాల్ నాయక్, ప్రవీణ్ నాయక్ ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



# సమస్యలు పరిష్కరించాలని వినతి



**అబ్దుల్లాపూర్మెట్,నవంబర్18(నేటిదర్శిని):** గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ... టీపీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ ఈర్లపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ శ్రీజన ఐఏఎస్ కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు జేపీఎస్ నుంచి గ్రేడ్ 4గా ప్రమోటైన వారి సర్వీస్ అంశంపై ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అందుకు సంబందించిన జీవో కాపీని కూడా పొందుపర్చినట్లు తెలిపారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ డైరెక్టర్ శ్రీ జన స్పందిస్తూ జేపీఎస్ అపాయింట్మెంట్ 2019 ఏప్రిల్ 12 నుంచి సర్వీస్ కాలాన్ని పరిగమనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. అలాగే త్వరలోనే పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించనున్నట్లు ఆమె తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరుణ్, రాష్ట్ర నాయకులు మిట్టపల్లి లక్ష్మీనారాయణ, కవిత, వివిధ జిల్లాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

**హైదరాబాద్,నవంబర్ (నేటి దర్శిని):** దళిత, గిరిజన బెస్ట్ అవైలబుల్ స్కీంలో భాగంగా రెండేండ్లుగా పెండింగ్లోని రూ.175 కోట్లు తక్షణమే విడుదల చేయాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. సోమవారం నగర కమిటీ నాయకలు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దళిత పిల్లలు 19వేల మంది, గిరిజన పిల్లలు 6 వేలమంది మొత్తం 25 వేలమంది చదువుకుంటున్నారనీ, ప్రతియేటా ఫీజులు చెల్లించాల్సిన ప్రభుత్వం రెండేండ్లుగా రూ.175 కోట్లు చెల్లించకపోవడంతో దళిత గిరిజన విద్యార్థుల చదువులకు కోత పడే అవకాశం ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 8నెలలు చెల్లించలేదనీ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఈ బిల్లులు చెల్లించకపోవడంతో పేద విద్యార్థుల తమ చదువులు నష్టపోతున్నారని వారు తెలిపారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో ప్రయివేట్ స్కూళ్ల యాజమాన్యాలు పిల్లలకు వసతి భోజనాలూ పెట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు వారు చెప్పారు. ఈ పథకం కింద చదువుతున్న విద్యార్థులఫీజులను తల్లిదండ్రులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారనీ, ప్రభుత్వం వెంటనే స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీం కింద బాకాయి పడ్డ 175కోట్లును చెల్లించి.. సమస్యను పరిష్కారించాలని వారు కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీమాన్ నాయక్, సహాయ కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## అరవింద్ మెడికల్ క్లినిక్ ను ప్రారంభించిన గాలి రవికుమార్ గౌడ్

**గుర్రంపోడు,నవంబర్ 18(నేటి దర్శిని):** గుర్రంపోడు మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డు నందు నూతనంగా ఏర్పాటు చేసిన అరవింద్ మెడికల్ షాప్&క్లినిక్ ను సోమవారం గుర్రంపోడు మండల మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్ గౌడ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత స్వయం శక్తితో వ్యాపార రంగంలో రాణించాలని అన్నారు. అరవింద్ మెడికల్ షాప్ ప్రొప్రైటర్ అరవింద్ మాట్లాడుతూ.. మావద్ద అన్ని రకముల బ్రాండెడ్ కంపెనీ మందులు తక్కువ ధరలకు లభిస్తాయని అదేవిధంగా క్లినిక్ లో కూడా పేషెంట్లకు వైద్య సదుపాయం కలదని అన్నారు.ఈ కార్యక్రమంలో గుర్రంపోడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య యాదవ్, స్థానిక మాజీ సర్పంచ్ మస్రత్ సయ్యద్ మియా తదితరులు పాల్గొన్నారు.





# రహస్యాల సత్యభామ

నేటి దర్శిని, సినిమా : "నేను హైదరాబాద్‌లోనే పుట్టాను. ఇక్కడే ఇంజనీరింగ్ చేశాను. కార్పొరేట్ జాబ్ కూడా చేశాను. తర్వాత మిస్ ఇండియా టైటిల్ గెలిచాను. మిస్ వరల్డ్ పోటీల్లో ఇండియాను రిప్రజెంట్ చేశాను. ఆ తర్వాత మూవీ వర్క్ షాప్‌కి వెళ్లాను. అక్కడే యాక్టింగ్‌పై ఇష్టం మొదలైంది. కాన్ఫిడెంట్ పెరిగింది. కొన్ని ఆడిషన్స్ కూడా ఇచ్చాను. అలా 'దేవకీనందన వాసుదేవ'లో హీరోయిన్‌గా ఎంపికయ్యాను. నా తెలుగు ఎంట్రీ ఇలాంటి మంచి సినిమాతో కావడం చాలా ఆనందంగా ఉంది' అని మానస వారణాసి అన్నారు. మహేశ్‌బాబు మేనల్లుడు గల్లా అశోక్ సరసన ఆమె నటించిన చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. దర్శకుడు ప్రశాంత్‌వర్మ కథతో, అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఈ నెల 22న విడుదల కానుంది. మానస వారణాసి సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు.

'ఇదొక కమర్షియల్ డివైన్ థ్రిల్లర్. తొలి సినిమాకే ఇలాంటి కథ, క్యారెక్టర్ దొరకడం నిజంగా అదృష్టం. ఇందులో నా పాత్ర పేరు సత్యభామ. విజయనగరం అమ్మాయిని. లవబుల్, మిస్టీరియస్ గర్ల్. కథలో నాది చాలా బలమైన పాత్ర. ఛాలెంజ్‌గా తీసుకొని ఈ పాత్ర చేశాను. అశోక్ చాలా ప్రొఫెషనల్. అతనికి సినిమా అంటే పాషన్. సెట్స్‌లో ప్రతి విషయాన్నీ షేర్ చేసుకునేవారు' అని తెలిపింది. భీమ్స్ సంగీతం సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని, బాలకృష్ణ సోమినేని చాలా పాషనేట్ ప్రొడ్యూసర్ అని మానస వారణాసి చెప్పారు.

# తెలంగాణ సోయి ఉన్నోళ్లు చూడాల్సిన సినిమా



నేటి దర్శిని, సినిమా : 'కేసీఆర్ అంటే ఓ చరిత్ర. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా పదేళ్ల పాటు అభివృద్ధి పథంలో నడిపించారు. కేసీఆర్‌గారు పల్లెలతో పాటు హైదరాబాద్‌ను అద్భుతంగా అభివృద్ధి చేశారు. కేవలం భౌతికపరమైన అభివృద్ధే కాకుండా సామాజికంగా, సాంస్కృతికంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలిపారు. ఈరోజు తెలంగాణ దేశానికి దిక్సూచిలా నిలబడిందంటే అందుకు కేసీఆర్‌గారు చేసిన కృషియే కారణం' అన్నారు మాజీ మంత్రి హరీశ్ రావు. జబర్దస్త్ నటుడు రాకింగ్ రాకేష్ స్వీయ నిర్మాణంలో హీరోగా నటించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్). గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమా ద్వారా కేసీఆర్‌గారు తెలంగాణ కోసం చేసిన పోరాటాన్ని ప్రజలకు చూపించే గొప్ప ప్రయత్నాన్ని చేశారు రాకేష్. సాధారణంగా ఎవరైనా పవర్‌లో ఉన్న పార్టీ మీద సినిమా తీస్తారు. కానీ అధికారంలో లేని పార్టీ మీద సినిమా తీశాడంటే అది అతనికి తెలంగాణపై ఉన్న ప్రేమ, దమ్ము.. ధైర్యం అనుకోవచ్చు. ముఖ్యమంత్రులు వస్తుంటారు.. పోతుంటారు. కానీ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఒకే ఒక్కరు కేసీఆర్. తద్వారా ఆయన ఓ చరిత్ర సృష్టించారు. అటువంటి కేసీఆర్‌గారి మీద సినిమా తీయడం అభినందనీయం. తెలంగాణ మీద సోయి వున్న వాళ్లు, తెలంగాణ ప్రేమికులు, కేసీఆర్ అభిమానులందరూ ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నా' అన్నారు. చిత్ర టీజర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ 'తెలంగాణలో ఎక్స్‌ప్లోర్ చేయాల్సిన కథలెన్నో ఉన్నాయి. ఇక్కడ అనేక వర్ణాలు, ఉద్వేగాలతో కూడిన గొప్ప జీవనం కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆత్మను ప్రతిఫలించే సినిమాలు ఇంకా రావాల్సి ఉంది. ప్రస్తుతం గిరిజనుల మీద అణచివేత గురించిన చర్చ జరుగుతున్నది. ఈ సందర్భంలో రాకేష్ గిరిజనుల మీద సినిమా తీశాడు. ఇందులో తెలంగాణ లంబాడి యువకున్ని హీరో చేసినందుకు రాకేష్‌ను అభినందిస్తున్నా. ఇలాంటి మరిన్ని కథలతో తెలంగాణ సినిమాకు స్వర్ణ యుగం రావాలని కోరుకుంటున్నా' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, దర్శకుడు ఎన్.శంకర్, వైకాపా నేత, సినీ నటి రోజా తదితరులు పాల్గొన్నారు.

# మరింత రాజుకున్న నయన్-ధనుష్ వివాదం





నేటి దర్శిని, సినిమా :తమిళ అగ్ర నటులు ధనుష్, నయనతార మధ్య వివాదం మరింత రాజుకుంది. ఈ నెల 16న ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన లేఖలో ధనుష్ వ్యవహార శైలిపై, వ్యక్తిత్వంపై నయనతార తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ధనుష్ తనపై ఈర్ష్యను పెంచుకున్నాడని, అతనిది అల్పబుద్ధి అని, దిగజారుడు వ్యక్తిత్వం అంటూ పరుష పదజాలంతో విరుచుకుపడింది నయనతార. ఈ వివాదం మొత్తానికి ఆమె జీవిత విశేషాలతో నెట్‌ఫ్లిక్స్ రూపొందించిన 'నయనతార బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీ కేంద్రమైంది. సోమవారం నుంచి ఈ డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య వివాదం ఇప్పట్లో సమసిపోయేలా కనిపించడం లేదు. నయనతార డాక్యుమెంటరీలో 'నానుమ్ రౌడీదాన్' (తెలుగులో 'నేనూ రౌడీనే') సినిమాకు సంబంధించిన మూడు సెకన్ల నిడివిగల క్లిప్‌ను ఉపయోగించడంపై ధనుష్ అభ్యంతరం చెప్పారు. ఈ సినిమాకు నిర్మాత ఆయనే కావడంతో కాపీరైట్ యాక్ట్‌కింద 10కోట్ల నష్టపరిహారం చెల్లించాలంటూ నయనతార టీమ్‌కు నోటీసులు పంపించాడు. దాదాపు రెండేళ్ల నుంచి సినిమా క్లిప్‌ను ఉపయోగించుకునే విషయంలో ధనుష్‌తో జరిపిన చర్చలు విఫలం కావడం, పది కోట్ల నష్టపరిహారం చెల్లించాలంటూ నోటీసులు పంపడంతో నయనతారలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ నేపథ్యంలో నయనతార ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సుదీర్ఘమైన లేఖను రాసింది. తాజాగా ఈ వివాదం మరోమలుపు తిరిగింది. నయనతార డాక్యుమెంటరీలో ఉపయోగించిన 'నానుమ్ రౌడీదాన్' సినిమా కంటెంట్‌ను 24 గంటల్లో తొలగించకపోతే లీగల్ యాక్షన్ తీసుకుంటామని ధనుష్‌కు చెందిన లాయర్ నయనతారకు నోటీసులు పంపారు. అయితే ఈ విషయంలో నయనతార వాదన మరోలా ఉంది. డాక్యుమెంటరీలో 'నానుమ్ రౌడీదాన్' సినిమా తాలూకు ఒరిజినల్ క్లిప్‌లను తీసుకోలేదని, షూటింగ్ సందర్భంగా పర్సనల్‌గా తీసుకున్న బిహైండ్ సీన్స్ ఫుటేజీని వాడుకున్నామని నయనతార చెబుతున్నది. దీనిపై ధనుష్ తరఫున లాయర్ తన నోటీస్‌లో స్పందించారు. సినిమాకు సంబంధించిన కంటెంట్‌పై నిర్మాతకు సర్వహక్కులు ఉంటాయని, పర్సనల్ ఫోన్లలో షూట్ చేసిన వీడియోలను కూడా ఉపయోగించే వీలు లేదని ఆయన నోటీసుల్లో పేర్కొన్నారు.

**ఇద్దరి మధ్య వివాదం ఏమిటి?**

నయనతార రాసిన లేఖ తమిళ చిత్రసీమలో హాట్‌టాపిక్‌గా మారింది. అసలు వీరిమధ్య వివాదానికి ఎక్కడ బీజం పడిందంటూ చర్చలు మొదలయ్యాయి. ఈ వివాదం పూర్వాపరాల్లోకి వెళితే 'నానుమ్ రౌడీదాన్' (2015) షూటింగ్ సమయంలోనే దర్శకుడు విఘ్నేష్‌శివన్‌తో చిత్ర కథానాయిక నయనతార ప్రేమలో పడింది. ఏడేళ్ల ప్రేమాయణం అనంతరం వారిద్దరు వివాహం చేసుకున్నారు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో దర్శకుడు విఘ్నేష్, నిర్మాత ధనుష్ మధ్య విభేదాలు తలెత్తాయి. బడ్జెట్ మించిపోతున్నదంటూ విఘ్నేష్‌పై అసంతృప్తిగా ఉండేవారు ధనుష్. సినిమా డిజాస్టర్ అవుతుందని తన సన్నిహితులతో చెప్పేవారు. అయితే ఆయన అంచనాలను తలక్రిందులు చేస్తూ 'నానుమ్ రౌడీదాన్' పెద్ద హిట్‌గా నిలవడమే కాకుండా విఘ్నేష్‌కు మంచి పేరు తీసుకొచ్చింది. ఈ పరిణామాలతో ధనుష్ ఇగో హర్ట్ అయిందని చెబుతారు. ఇదే విషయాన్ని నయన తార తన లేఖలో పరోక్షంగా ప్రస్తావించింది. 'సినిమా సక్సెస్‌కావడంతో ధనుష్ అంచనాలన్నీ తప్పాయి. విఘ్నేష్‌ను నిందించే అవకాశం లేకపోవడంతో ఆయన ఇగో హర్ట్ అయింది. అందుకే 2016 ఫిల్మ్‌ఫేర్ ప్రదానోత్సవంలో కూడా తన అక్కసును వెళ్లగక్కాడు' అంటూ నయనతార లేఖలో రాసుకొచ్చింది. తాజా పరిణా మాల నేపథ్యంలో ఈ వివాదం మరెన్ని మలుపులు తిరుగుతుందోనని తమిళ సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.